

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 జూన్, 2013 సంచిక : 1

(విజయ నామ సం॥, జ్యేష్ఠ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

సాయితో తర్ఖడ్ స్మృతులు .......... 5

వేద విద్య .......... 10

గాంధీ వాణి .......... 12

షిరిడీ (కపర్దే) డైరీ .......... 13

శ్రీ సాయి సేవ .......... 15

స్వరాంజలి .......... 17

మాతృసంస్థ కబుర్లు .......... 19

విషాదం .......... 28

రమణ ఉవాచ .......... 28

సాయితో నా అనుభవం .......... 29

సమయ పాలన .......... 30

శ్రీ సాయి విద్యాధామం .......... 32







# మా వాణి



మనం దేవాలయాలు నిర్మించుకొంటున్నాం. ఎన్నెన్నో సేవాసంస్థలు స్థాపించుకొంటున్నాం. గుడులైనా, సంస్థలైనా మానవకళ్యాణం కోసం నిర్దేశింపబడేవే. సామాన్యజనులు దేవాలయంలోని విగ్రహాన్ని సాక్షాత్తు భగవంతుడిగా తలుస్తారేగానీ బొమ్మగా భావించరు. అలాగే ప్రతి సేవా సంస్థా దాదాపుగా ఏదో ఒక దైవాన్ని ఆశ్రయించుకొనే ఉంటాయి - ఎక్కడో ఒకటి రెండు తప్ప. వీటన్నిటి పోషణ కోసం భక్తులే ఆధారమౌతుంటారు. వారు గుడికి ఇచ్చిన ప్రతి పైసా, ప్రతి వస్తువు దైవం పేరిటే సమర్పించు కుంటారు. కనుక అదంతా దైవ ద్రవ్యమే అవుతుంది. ఆ దైవద్రవ్యాన్ని, గుడిని నడుపుతున్నవారుగానీ, పూజాదికాలు నిర్వహిస్తున్నవారుగానీ తమకు ఎంత అవసరమో లేదా, ఎంత నిర్ణయింపబడిందో అంతవరకే దైవ ద్రవ్యాన్ని ఉపయోగించుకోవాలి. అలా కాకపోతే పాపాన పడినవారవుతారు.

రామాయణంలో ఒక కథ ఉన్నది - ఒకసారి ఒక కుక్క రాజాస్థానానికి వచ్చి తనకు న్యాయం కావాలని మొరపెట్టుకొన్నది - మానవవాక్కులలో శ్రీరాముడు దానికి జరిగిన అన్యాయాన్ని వివరించమన్నాడు. “అయ్యా! నేను ఒక బ్రాహ్మణుడి ఇంటి ముందు నుండి నడుస్తుంటే అతడు నన్ను నిష్కారణంగా రాతితో కొట్టి గాయపరిచాడు. అతనిని శిక్షించి నాకు న్యాయం చేయండి” అన్నది గ్రామసింహం. ఆస్థానంలోని న్యాయవేత్తలంతా ఒకరిమొగం ఒకరు చూసుకున్నారు. అప్పుడు శ్రీరాముడు “నీవు మాటలు నేర్చినదానివేకాక-ధర్మవేత్తవు లాగా కూడా తోస్తున్నావు. అందుచేత ఏమి శిక్ష విధించాలో నీవే చెప్పు” అన్నాడు. కుక్క ఆ బ్రాహ్మణుడికి ఫలానా గుడిలో అర్చక పదవి ఇమ్మన్నది. “శిక్ష వేస్తానని ఉద్యోగం చూపిస్తానంటా

వేంటీ” అని అడిగాడు రాముడు. దానికి ఆ కుక్క ఫక్కున నవ్వింది. “మహారాజా, గత జన్మలో నేను అక్కడ అదే పని చేసాను. పొరపాటున దైవ ద్రవ్యం తిన్న పాపానికి ఇప్పడీ జన్మ వచ్చింది. ఇప్పుడు ఇతన్ని కూడా అదే పనిలో పెడితే దైవద్రవ్యం ఆరగించి ఇప్పుడు నేనున్న స్థితికే వస్తాడు. అదీ సంగతి” అన్నది. సాయిబాబావారు ఒకసారి తన చెంతకు వచ్చిన రతన్‌జీ షాపూర్జీ వాడియాతో “నీవు ఇంతకుముందే నాకు మూడు రూపాయల పద్నాలుగణాలు ఇచ్చావు. ఇక మిగిలిన ఒక రూపాయి రెండణాలు ఇస్తే సరిపోతుంది” - అని అంతవరకే తీసుకున్నారు. అంటే తనకెంత రావాలో అంతే తీసుకుంటారు యోగులు. సామాన్యులు పక్క వాడి సొమ్ము కూడా తమకే కావలనుకుంటారు. ఇక ఇంకా కొందరు అసామాన్యులు మాత్రం దైవద్రవ్యాన్ని-అసలు ద్రవ్యాన్నేమిటీ, గుడినీ, గుడిలో లింగాన్ని కూడా దిగమ్రింగుదామనుకుంటారు. పురాతన శిల్పాలు పరదేశాలకు అమ్ముకోవడం, దేవుడి నగలు కరిగించుకొని తాగేయడం, దేవుడి మాన్యపు భూములన్నీ గుటకాయస్వాహా చేయటం, చివరికి ధూప దీప నైవేద్యాల కోసం కేటాయించిన డబ్బు కూడా తమకే ముడుపు కట్టుకోవడం - ఇలాంటి లీలలకు అంతే లేదు. దేవాదాయశాఖలో దూరి, దేవాలయాల సొత్తును విధర్మీయుల నిమిత్తం బదలాయించే మహా పురుషుల సంగతి చెప్పనే అక్కరలేదు.

బాబా చరిత్రలోనే దీనిని గురించిన మరో విషయం ఉన్నది. శ్యామా బాబాకు చాలా దగ్గరి భక్తుడు. ఒకసారి బాబాకు రెండు రూపాయలు మనియార్డరు వచ్చింది. శ్యామా దానిని బాబాకు ఇవ్వకుండా దాచిపెట్టాడు. బాబా వారికి ఇది తెలియనట్లే ఉన్నారు. కొద్దిరోజుల తర్వాత శ్యామా ఇంట్లో దొంగలు పడి అంతా దోచుకుపోయారు. శ్యామా చాలా బాధపడి వచ్చి బాబా దగ్గర మొరపెట్టుకున్నాడు. అప్పుడు బాబా “నీ డబ్బు పోతే చెప్పకో డానికి నేనైనా ఉన్నాను. నావి రెండు రూపాయలు పోయాయి. నేనెవరికి చెప్పకోనురా!” అన్నారు. శ్యామాకు అర్థమయింది. తన దోషమే తనకు శిక్షయిందని. స్వామి “నా కొంటెతనాన్ని ఇలా





శిక్షించారా” అని నమస్కారం చేశాడు. బాబా శ్యామా తీసుకున్న రెండు రూపాయల కోసం అంతగా శిక్షించాలా అని ఒక ప్రశ్న వస్తుంది. అది కేవలం రెండు రూపాయలు మాత్రమే కావు. ఇచ్చినవాడు రెండే ఇచ్చాడు. కానీ, బాబా వాగ్దానం ఏమిటి? ఒక్కడుగు నావైపు వేస్తే పది అడుగులు నీవైపు వేస్తానని కదా! అంటే - ఆ రెండు రూపాయలు ఇచ్చిన వాడికి బాబా తిరిగి ఇరవై రూపాయలు ఇవ్వవలసి ఉంటుంది. అవి ఈయనకు అందలేదు. అవతలి వాడికి ఇరవై ఎలా దొరుకుతాయి? కనుక ఆ మేరకు శ్యామా అవతలి భక్తుడి ప్రయోజనాన్ని కూడా దెబ్బతీసినట్లే కదా! అదీ సంగతి. అందుచేతనే మన పెద్దలు దేవాలయ సంరక్షకులుగానీ, ధార్మిక సంస్థలు నడిపేవారు గానీ గడ్డివామి దగ్గర కుక్కల్లాగా ఉండాలని చెప్పారు. కుక్క తాను గడ్డి తినదు. పరాయి గొడ్లను వచ్చి గడ్డి మీద పడనివ్వదు. అందుచేత మిత్రులారా, దైవద్రవ్యాన్ని పేదల కోసం, దీన దుఃఖితుల కోసం, భక్తుల ప్రయోజనాల కోసం వాడాలే తప్ప - స్వప్రయోజనాల కోసం లగ్జరీస్ టైప్‌లో ఉండే వస్తువుల కోసం వ్యర్థంగా ఖర్చు చేస్తే మాత్రం - జాగ్రత్త సుమా! రామాయణంలో కుక్క తీర్పు చెప్పడానికి వచ్చేస్తుంది.

## సాయివాణి పాఠకులకు ....

మిత్రులారా,

గత ఇరవై మూడేళ్లుగా సద్విషయాలు భక్తులకు అందించడమే లక్ష్యంగా సాగుతున్నది సాయివాణి. దీని బరువు పంచుకోవడానికి మీరంతా ముందుకు రావాలని ఆశిస్తున్నది. పత్రిక ధర ఎంతో అందుబాటులో ఉన్నది. అభిమానులైన మీరందరూ వివిధ దేవాలయాల పేరిట, సత్సంగ కేంద్రాలకు, విద్యాలయాలకు, మీ మిత్రులకు ఈ పత్రిక చేరేలాగా వారి పేరిట చందాలు కట్టి పత్రికకు పరిపుష్టమైన ఆసరా కలిగించండి. తద్వారా ఆయాచోట్ల సాయివాణి ప్రతిధ్వనించే అవకాశం కల్పించండి. సాయిసేవలో ధన్యులు కండి.

- మీ ప్రధాన సంపాదకురాలు

# సాయితో తర్ఖడ్ స్మృతులు-1

(శ్రీ సాయి సచ్చరిత్ర 9వ అధ్యాయంలో హేమాడ్పంతుగారు బాబా సాహెబ్ తర్ఖడ్ అనే పేరు గల శ్రీ రామచంద్ర ఆత్మారామ్ తర్ఖడ్, వారి భార్య శ్రీమతి ... తర్ఖడ్, వాళ్ళబ్బాయి శ్రీ జ్యోతీంద్ర తర్ఖడ్‌ల గురించిన విశేషాలు వ్రాసారు. రామచంద్ర ఆత్మారామ్‌గారి ద్వితీయ పుత్రుడు జ్యోతీంద్ర. ఆయన కుమారుడు వీరేంద్ర (జ్యోతీంద్ర) తర్ఖడ్. (మహారాష్ట్రులు వారి తండ్రి పేరు, ఇంటిపేరు రెండూ తమ పేరుతో జోడిస్తారు.) ఈ వీరేంద్ర గారు తమ తాతగారు, నాయనమ్మ, తమ తండ్రిగారు తదితర కుటుంబీకులకు శ్రీ సాయితో గల సాన్నిహిత్యాన్ని గురించీ, సాయి వారికిచ్చిన అనుభవాల గురించీ విన్నవీ, తెలుసుకున్నవీ అన్నీ గ్రంథస్థం చేయటం ద్వారా సాయిభక్తులకు ఎనలేని సేవ చేసారనటం నిస్సందేహం. ఈ గ్రంథానికి తెలుగు సేత శ్రీ ఆత్రేయపురపు త్యాగరాజు.

- ప్రధాన సంపాదకులు)

ఈ సంఘటన ఒక వేసవికాలపు రోజున జరిగింది. జ్యోతీంద్ర అప్పడే మెట్రో సినిమా దగ్గరున్న ఇరానీ రెస్టారెంట్‌లో ఫలహారం చేసి, తను చదివే 'సెంట్ జేవియర్' స్కూలుకు వెడుతున్నాడు. స్కూలు విరామ సమయంలో ఇరానీ రెస్టారెంట్‌కు వెళ్ళి ఫలహారం చేయడం అతనికి ప్రతిరోజు జరిగే కార్యక్రమం.

ఆ రోజు అతను రోడ్డు దాటుతున్నప్పడు తెల్లని దుస్తులలో ఉన్న ఒక ఫకీరు అతన్ని పిలిచి దక్షిణ అడిగాడు. జ్యోతీంద్ర ఒక పైసా నాణెం (రాగి నాణెం, మధ్యలో కన్నం ఉండేది. దీనినే చిల్లు కాణీ అనేవారు) జేబులోంచి తీసి దానిని ఆ ఫకీరుకిచ్చి స్కూలుకు వెడుతున్నాడు. కాని ఆ ఫకీరు అతన్ని ఆపి, అది 1894 సంవత్సరంలో ముద్రించిన ఒక పైసా నాణెం





అని జ్యోతీంద్రతో అన్నాడు.

ఆ రోజులలో ప్రజలు ఒక పైసాను ధర్మంగా యిస్తూ ఉండేవారు. ఆ విధంగా ఒక పైసా ఒక విద్యార్థి దానం చేయడమంటే ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. జ్యోతీంద్ర, ఫకీరుతో తనకి ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం నిమిత్తం నాలుగు అణాలు ఇవ్వబడతాయనీ, అందుచేత ఒక పైసా ఇంకా దానం చేయగలననీ చెప్పాడు. అంతేకాకుండా ఈ ఒక పైసా ఇంకా చెలామణిలోనే ఉంది. కాబట్టి ఫకీరు దాని గురించి బెంగ అక్కరలేదని చెప్పాడు. అప్పడా ఫకీరు "అల్లా భలా కరేగా" అన్నాడు. అప్పడు జ్యోతీంద్ర స్కూలుకు వెళ్ళిపోయాడు. ఇక ఈ విషయం గురించి మరచిపోయాడు.

జ్యోతీంద్రగారికి ఇద్దరు అన్నయ్యలు. సత్యేంద్ర, రవీంద్ర. వీరు మెడికల్ కళాశాలలో చదువుతూ ఉండేవారు. సత్యేంద్రగారు జీ.జీ.ఎం.సీ (గ్రాడ్యుయేట్ మెడికల్ కాలేజ్-యిదే తరువాత ఎం.బీ.బీ.ఎస్.గా రూపాంతరం చెందింది.) డిగ్రీ సాధించారు. ఆయన రచయిత తండ్రికి సోదరుడు. ఈయన మాతుంగాలోని 'కొంకన్' నగర్‌లో ఉండేవారు.

(ఇప్పడాయన లేరు. ఆయన కొడుకు, కూతురు అక్కడ ఉంటున్నారు) జ్యోతీంద్రగారి సోదరుడు డాక్టరు. ఆయన మామయ్య డాక్టరు. ఆయన తాతగారు ప్రముఖ మెడికల్ ప్రాక్టీషనరే కాకుండా బొంబాయి వైస్రాయి గారికి కుటుంబవైద్యులు కూడ. క్లుప్తంగా చెప్పాలంటే జ్యోతీంద్రగారి వైద్యుల కుటుంబం.

జ్యోతీంద్రగారి కుటుంబంలో యింతమంది వైద్యులు ఉన్నాగాని, జ్యోతీంద్రగారి తల్లి, అంటే రచయిత గారి నాన్నమ్మగారు మైగ్రేన్‌తో విపరీతమైన తలనొప్పితో బాధపడుతూ ఉండేది. అన్నిరకాల మందులను వాడి చూశారు. కాని అది యింక నివారణ కాదని తెలిసిపోయింది.

వారింటిలో వారితో కలిసి పనిచేస్తూ ఒక పనిమనిషి ఉండేది. ఆమె

బాంద్రా మసీదు దగ్గరున్న పీర అని పిలవబడే మౌలానా బాబా వద్దకు వెళ్ళమని సలహా యిచ్చింది. ఆయన కొన్ని ఆయుర్వేద మందులిస్తారని, ఎక్కడా నయమవని జబ్బులు కూడ తగ్గుతాయని చెప్పింది.

ఆ రోజులలో ఒక హైందవ స్త్రీ మసీదుకు వెళ్ళి ఒక పీర్ను కలుసుకోవడ మంటే చాలా కష్టసాధ్యమయిన విషయం. మా నాన్నమ్మగారు తన కుమారుడు జ్యోతీంద్రగారికి ఒక సలహా యిచ్చింది. స్వభావసిద్ధంగా చాలా ధైర్యవంతుడయిన ఆయన ఒక బురఖా ఏర్పాటు చేసి తన తల్లిని కారులో పీర్ మౌలానా బాబా వద్దకు తీసుకొని వెళ్ళాడు.

ఒక మానవమాత్రుడు తీరని వ్యాధితో బాధపడుతున్నపుడు మత కట్టుబాట్లను ఛేదించడం కష్టం కాదు. కాని మౌలానా బాబాని కలుసుకొన్న తరువాత వారి కష్టాలు నెమ్మదించడానికి బదులు ఎక్కువయ్యాయి. మౌలానా బాబా మా నాన్నమ్మతో ఆమె బాధపడుతున్న వ్యాధిని నయం చేయడానికి తన వద్ద మందు లేదని చెప్పాడు.

కానీ "షిరిడీలో నా సోదరుడు సాయిబాబా అనే ఆయన ఉన్నాడు. మీరు ఆయన వద్దకు వెళ్ళండి. ఆయన మీకు నయంచేసి మీ బాధలన్ని టిని పోగొడతాడు" అని చెప్పాడు.

ఇప్పుడు వారిద్దరు పెద్ద కష్టంలో పడ్డారు. మొదటగా మా తాతగారు ప్రార్థనాసమాజ్వాది. ఎక్కువ అహంకారి. ఆయన అటువంటి బాబాలను కలుసుకోవడానికి అనుమతివ్వరని వారికి తెలుసు. ఇక రెండవది, షిరిడీ ఎక్కడ ఉంది? అక్కడకు ఎలా వెళ్ళాలన్నదే పెద్ద ప్రశ్న.

ఏమయినప్పటికీ జ్యోతీంద్ర వెనుకాడలేదు. ప్రియ పాఠకులారా! ఇక్కడ నేను దృఢంగా అనుకునేదేమంటే, వారు శ్రీ సాయిబాబాను కలుసుకోవా లని వారి భవితవ్యం ముందే వ్రాసి ఉంచబడి ఉంటుంది. అందుచేత ఎవ్వరూ కూడ వారిని ఆపలేరు. ఆయన మెట్రో థియేటర్ వద్దనున్న ఇరానీ రెస్టారెంట్ యజమాని నుంచి సమాచారాన్నంతా సేకరించారు.

షిరిడీ గ్రామం అహ్మద్నగర్ జిల్లాలో ఉందని, అక్కడికి వెళ్ళాలంటే





ఎవరైనా రైలులో మన్మాడ్ మీదుగా కోపర్గావ్ వెళ్ళాలని తెలుసుకున్నారు. కోపర్గావ్ నుంచి 9 కి.మీ. దూరంలో ఉన్న షిరిడీకి గుఱ్ఱపుబండిలో వెళ్ళాలి. దీనర్థం ఏమిటంటే ఇంటి నుంచి బయలుదేరితే కనీసం మూడు రోజులు ఇంటికి దూరంగా ఉండాలి. ఏమయినప్పటికీ జ్యోతీంద్ర వాళ్ళ నాన్నగారి అనుమతి సంపాదించి ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసారు.

ఒక శుక్రవారం సాయంత్రం తల్లి, కొడుకులిద్దరూ షిరిడీకి బయలు దేరారు. శనివారం ఉదయానికి వారు షిరిడీలో ఉన్నారు. వారు వివరాలన్నీ సేకరించిన తరువాత స్నానాదికాలు అన్నీ కానిచ్చి శ్రీ సాయిని కలుసుకోవ డానికి ద్వారకామాయికి చేరుకున్నారు. వారు సాయిబాబా పవిత్రమైన ధుని ముందు కూర్చుని ఉండటం చూసారు.

మా నాన్నమ్మగారు బాబా ముందు వంగి ఆయన పాదాలను స్పృశించారు. వారిద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు.

బాబా మా నాన్నమ్మగారితో "అమ్మా నువ్వు వచ్చావు. బాంద్రా నుంచి నా సోదరుడు నిన్ను నా వద్దకు పంపించాడు. దయచేసి కూర్చో. అమ్మా నీకు చాలా విపరీతమైన తలనొప్పి ఉంది అవునా?" అని అన్నారు. అపుడు సాయిబాబా తన అయిదువేళ్ళను ఊదీ ఉన్న పళ్ళెంలో ముంచారు. (పవిత్ర భస్మం) ఊదీతో నిండి ఉన్న ఆ చేతితో మా నాన్నమ్మగారి నుదుటి మీద కొట్టారు.

ఆయన నుదుటిని అయిదువేళ్ళతో గట్టిగా పట్టుకొని అన్నారు. "అమ్మా, యిప్పటినుంచి నీవు చనిపోయేవరకు నీ తలకు ఇక ఎటువంటి నొప్పి రాదు. నీ తలనొప్పి పూర్తిగా నివారణయింది".

ప్రియ పాఠకులారా! సాయి చేసిన ఈ చర్యకి మా నాన్నమ్మగారు ఆశ్చర్యచకితులయారు. ఆమె తన బాధ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. బాబాగారికి వారి రాక గురించి, ఆమె బాధ గురించి ఎలా తెలుసు?

వారిద్దరి మధ్య జరిగిన చూపులు - అనగా దృష్టి కలయిక, మరియు

ఊదీ నిండిన చేతితో నుదుటి మీద కొట్టడం - మా నాన్నమ్మ గారికి ఎప్పుడూ అటువంటి శక్తివంతమైన మోతాదులో మందు ఇవ్వబడ లేదు. ఏమి జరిగిందన్నదీ తెలియదు. ఆమెకు అనుభవమైనదల్లా తనకు బాగయినట్టు. తలనొప్పి వల్ల వచ్చిన ఆమె వదనంలోని విచారం మటుమాయమయిపోయింది.

ఆమె ఇప్పడు కొత్తగా కనపడుతోంది. ఆమె మా నాన్నగారు జ్యోతీంద్ర గారితో బాబాకు నమస్కరించమని చెప్పింది. ఇది అంతా చూసి మా నాన్నగారు ఆశ్చర్యపోయారు. ఆయన తల్లి ఇంతకుముందు ఎప్పడూ అలా ఆజ్ఞాపించలేదు. అపుడు మా నాన్నగారు బాబా ముందుకు వంగి ఆయన పాదాలను స్పృశించారు. వెంటనే బాబా ఆయనతో "ప్రియమైన భావూ (సోదరా) నువ్వు నన్ను గుర్తించలేదా?" మా నాన్నగారు గుర్తించలేదన్నట్లు జవాబిచ్చారు. అపుడు బాబా ఆయనతో "నావైపు చూడు, బాగా గుర్తు తెచ్చుకో, మరల జ్ఞప్తికి తెచ్చుకోవటానికి ప్రయత్నించు" అన్నారు.

మా నాన్నగారికి ఏమీ గుర్తుకు రాలేదు. అపుడు బాబా తన కఫ్నీ జేబులో చేయిపెట్టి ఒక పైసా రాగినాణెం తీశారు. దానినే మా నాన్నగారికి చూపించారు "ఏయ్ భావూ 1894 సం॥ సంబంధించిన ఈ రాగినాణెం గుర్తుందా? నువ్వు స్కూలుకు వెళ్ళేటప్పడు ఒక ఫకీరుకు దక్షిణ ఇచ్చావు.

ఇపుడు మా నాన్నగారు ఈ అధ్యాయం మొదటిలో వివరించిన సంఘటనని తిరిగి గుర్తు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఆయన నేత్రాలు కన్నీళ్లతో నిండిపోయాయి. ఆయన వెంటనే తన చేతులతో బాబాగారి కాళ్ళు గట్టిగా పట్టుకొన్నారు.

బాబా ఆయనని లేవనెత్తి అన్నారు "ఏయ్ భావూ, ఆ రోజు మధ్యాహ్నం నువ్వు కలుసుకున్న ఫకీరు నేను తప్ప మరెవరూ కాదు. నీవు ఇచ్చిన ఈ పైసాను తిరిగి యిస్తున్నాను-దీన్ని తీసుకుని జాగ్రత్తగా భద్రపరచుకో. అది నీకు ఎన్నో పైసలను పెడుతుంది". అదీ బాబాతో జ్యోతీంద్రగారి తొలి కలయిక.





# వేద విద్య

- డా॥ డి. చంద్రశేఖర రెడ్డి

వేదకాలంనాటి జీవితం అతి సామాన్యం. ఆలోచనలు అతి ఉదాత్తం. జీవనం సాధారణం. భావాలు ఉన్నతాలు అయిన స్థితి ఋగ్వేదకాలంనాటి జీవితం. ఋగ్వేదవాక్కుల్ని మానవమేధ నిర్మించిన మహానిర్మాణాలుగా భావించవచ్చు. ఇవి అనంతవిశ్వాన్ని చుట్టి వచ్చే అద్భుతమయిన ఆలోచనలు- జ్ఞానశిఖరాగ్రాలు.

యజ్ఞం కంటె కూడ జ్ఞానం గొప్పదని చెప్పే ఋక్కు ఒకటి ఉంది. దానం కంటే గొప్ప మతం లేదంటాడు. జూదం వలన నష్టాలు చెప్పే ఋక్కు ఉంది. 'జూదం ఆడవద్దు, పొలం దున్ను, ఉన్న సంపదను అనుభవించు, భార్యతో సుఖించు' అంటాడు వేదకర్త.

అర్థరహితంగానూ, సౌందర్యరహితంగానూ వారి వాక్కు ఉండదు. సామాజిక తత్త్వాన్ని అర్థం చేసుకొని విశ్లేషించడం కనిపిస్తుంది. పుట్టుక, వివాహం, మరణం వంటి మానవజీవితంలోని ప్రధానాంశాలను గురించిన వివేచన వేదం నిండుగా ఉంటుంది. స్త్రీ, పురుష సంబంధాల చర్చ ఉంటుంది. దానం ప్రాధాన్యం చెప్పడం, జూదం చెడును చెప్పడం సామాజిక జీవితం గురించిన వారి ఆలోచనలు వెల్లడించడమే.

అందువల్ల వేదం చదవడం అంటే ఏవో అర్థం కాని మంత్రాలు ఉచ్చారణ, పునశ్చరణ కాదు. ప్రకృతినీ, మనిషి జీవితాన్నీ, సృష్టి రహస్యాన్నీ చదవడమే. ఇప్పటికీ వీటి అధ్యయనమే మన జీవితంలో ప్రధానమైన విషయం. ముందుకు సాగడమే మన ఇచ్ఛ. దానినే విద్య అని అంటే తెలుసుకోవడం అని అందాము.

**దేవతలు :** దేవతలంటే ప్రకృతేనన్నది స్పష్టం.

అగ్ని, వాయువు, జలం, అరణ్యం, భూమి, ఆకాశం, సూర్యుడు అంతా

ప్రకృతే. ప్రకృతిలో తన అస్తిత్వానికి మూలమయిన అన్నిటినీ నాటి మానవుడు గౌరవించాడు. ఆరాధించాడు. వాటికి వ్యక్తిత్వం కూర్చాడు.

వాటికి ప్రతిమలేర్పరచటం, గుళ్ళు కట్టడం, పూజలు చేయడం చాలా తర్వాతికాలంలో ప్రారంభమయింది. తొలిదశలో అంతా మానసికమే. ఆ తర్వాతి కాలంలో సమాజంలో అత్యున్నతస్థాయికి ఎదిగినవాళ్ళు, సమాజాభివృద్ధికి అగణితమైన సేవ చేసినవాళ్ళు, సాహసాలు చేసిన వాళ్ళు దైవత్వాన్ని పొందారు. ఆరాధనీయులంతా దేవస్థానాన్ని ఆక్రమించారు. మన పితృపితామహులకు దైవత్వం కల్పించాం. అతిథిని దేవుడన్నాం, గురువును దేవుడన్నాం. దేవతలు ముప్పై ముగ్గురి నుండి మూడు కోట్లకు పెరిగింది. దైవమొక్కడే అన్నాం.

విశ్వంలో దేవుడు కానిదేముంది? అంతా దేవుడే అయినప్పుడు ప్రతి జీవి, వస్తువూ కూడా దేవుడే కదా! దేవతల సంఖ్య అనంతం కావడంలో ఆశ్చర్యమేముంది? నీవు దేవుడివి. నీ యెదుటనున్నవాడు దేవుడు. వాడితో నీ వ్యవహారం ఎలా ఉంటుంది? నీ ఎదుట ఉన్న చెట్టు దేవుడు. పురుగు దేవుడు. వాటి పట్ల నీ వ్యవహారం ఎలా ఉంటుంది? ఎలా ఉండాలి? ఆలోచిస్తే సమస్త సృష్టినీ నీలాగే భావించు - ఇదే వేదం చెప్పింది.

చివరగా విరాట్పురుషుని వంటి ఉన్నత స్థాయి తత్త్వం ఉంది. మూర్త (సాకార) దేవతల నుండి అమూర్త (నిరాకార) దైవంవైపు పురోగమనం కనిపిస్తుంది. భగవంతుణ్ణి ధాత, విధాత, ధర్మత్రాత, నేత, త్వష్ట, సవిత, విశ్వకర్మ, హిరణ్యగర్భ అని పిలవడం కనిపిస్తుంది. మన్యు, శ్రద్ధ, అనుమతి, అరమతి, సూనృత, అపనీతి, నిర్ఋతి, అదితి వంటి భావాలు దైవరూపాన్ని పొందాయి. అదితి సంతానం ఆదిత్యులు. అరణ్యాన్ని అన్న దేవత కూడ ఉంది. ఈ దేవత క్రూరజంతువులకు నివాసం. పథికులకు తన ఫలాలను ఆహారంగా సమృద్ధిగా ఇస్తుంది. పుష్పాలతో సౌరభాలను విరజిమ్ముతూ ఉంటుంది. అంటే ఋగ్వేదఋషి అరణ్యాన్ని కూడ దేవతగా పూజించాడు. ప్రకృతి, మానవ సంబంధాన్ని అత్యున్నతమైనదిగా గుర్తించాడు.





**విశ్వ మానవుడు :** వేదం ఒక వ్యక్తిని గురించిన ఆలోచన కాదు. సకల చరాచర ప్రపంచం సుఖమయం కావాలి. నీకు, అంటే నీ సమాజానికి అవసరమై చెట్టు కొడుతున్నావు. దాన్ని హింసిస్తున్నావు. కనీసం క్షమించమని అడగాలి కదా! దండం పెట్టుకోవాలి కదా! అటువంటి సంస్కృతినే వేదకాలం నాటి భారతీయ మానవుడు అవలంబించాడు. అరలు గీసుకోలేదు. హద్దులు లేవు. విశ్వం గురించీ, విశ్వమానవుడి గురించే ఆలోచించాడు.

"సర్వే భద్రాణి పశ్యంతు" అంతా భద్రంగా ఉండాలని, శాంతిగా ఉండాలని, సుఖంగా ఉండాలని ఆకాంక్షించాడు.

అటువంటి ఆలోచనల్ని, సంప్రదాయాన్ని తరువాతి తరాలకు అందించడమే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. వాళ్లనీ ఆలోచించమన్నాడు. క్రొత్త ఆలోచనలను ఆహ్వానించాడు. తన విద్యను తరువాతి తరానికి అందించాడు. ఆ తరాన్నీ అదే పని చేయమన్నాడు.

విద్య పరంపరంగా కొనసాగిందిలా.

**- (భారతీయ విద్య నుండి)**

## గాంధీ వాణి

"There is a sufficiency in the world for a man's need but not for greed"

మానవుడు తమ అవసరాలూ, ఆశలూ-వీటి మధ్య నలిగిపోతూ ఉంటాడు. ఈ రెండింటికీ ఉన్న భేదం ఏమిటో స్పష్టంగా తెలుసుకోలేక పోతున్నాడు. మనిషి తన అవసరాలు తీర్చుకోవటంతో ప్రపంచంలో యిన్ని అనర్థాలు జరగవు. రేపటికి, తరువాత తరానికీ, బంగారు సింహాసనాల కోసం, వెండి ఉయ్యాల కోసం ఆరాటపడి ధర్మమార్గాన్ని తప్పుతున్నాడు. మనిషి అవసరాలకు ఒక అంతం ఉంటుందిగానీ ఆశలకు అంతం లేదు గదా! అందుకే యీ దౌర్భాగ్యం పట్టింది మన దేశానికి. మన మహాత్ములు చెప్పిన యీ వాక్యం కంఠస్థం చేద్దాం-భావం రక్తగతం చేసుకుందాం.



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

07-12-1911

నేను రాత్రి బాగా నిద్రపోయాను. మా ఆవిడ, మా అబ్బాయి భీష్మ దగ్గర బాగానే ఉన్నారు. విష్ణు కూడా ఇక్కడ ఉన్నాడు. ఇవాళ మేము చాలామందికి భోజనాలు పెట్టాము. అటుపైన మామూలు దినచర్యలో పడిపోయాము. బాబా సాయి మహరాజ్ బయటికి వెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చాక, మళ్ళీ సాయంత్రం, ఇంకా వారు నిద్రించడానికి వెళ్లిన చావడిలోను, పదేపదే నమస్కారం చేసుకున్నాము. ఆ రోజు భజన, పూజ కొంత తక్కువ. నేను శేజారతి నుండి తిరిగి వచ్చాక భీష్మ తన మామూలు భజన చేస్తుంటే తోసర్ కూడా తన పాటలు కొన్నీ, కబీరు, దాసుగణు తదితరుల పాటలు కూడా పాడాడు. దాసుగణు భార్య బయాబాయి గత సంవత్సరం ఇక్కడే ఉందిగానీ ఇప్పుడు పుట్టింటికి వెళ్ళింది. మేము రాత్రి పొద్దుపోయే దాకా మాట్లాడుకుంటూ ఉన్నాము. మాధవరావ్ దేశ్‌పాండే మాకు దాదా కేల్కర్ మేనల్లుడు బాబు అనే అతన్ని సాయి మహరాజ్ చాలా దయతో చూచేవారని చెప్పాడు. "ఆ బాబు చనిపోయాడు. అయినాగానీ ఈనాటికీ అతన్ని గుర్తు చేసుకుంటారు" అని చెప్పారు. బొంబాయిలో ప్లీడరుగా ప్రాక్టీస్ చేస్తున్న మోరేశ్వర్ విశ్వనాథ్ ప్రధాన్ సాయిమహరాజ్‌ను చూడడానికి వచ్చారు. అతని భార్యను చూస్తూనే "ఈమే బాబు తల్లి" అన్నారు సాయి మహరాజ్. ఆ తర్వాత ఆమె గర్భవతి యింది. బొంబాయిలో ఆమె ప్రసవవేదన పడుతున్నప్పుడు ఇక్కడ తమకు నొప్పులు వస్తున్నాయని అన్నారు సాయి మహరాజ్. కవల పిల్లలు పుడతారనీ, కానీ వారిలో





ఒకడు చనిపోతాడనీ అన్నారు. అలాగే ప్రధాన్ భార్యకు జరిగింది. ఆ తరువాత ఆమె తన కొడుకుతో షిరిడీ వచ్చి నపుడు సాయి మహరాజు అతన్ని ఒళ్లోకి తీసుకొని "ఇక్కడికి వస్తావా?" అని అడిగారు. ఆ రెండు నెలల పసిబిడ్డ స్పష్టంగా 'ఊఁ!' అన్నాడు.

08-12-1911

నేను ప్రస్తావించటం మర్చిపోయాను - నిన్నా, మొన్నా కూడా. నేను రాగానే ఉపాసనీ వైద్య వచ్చి నన్ను కలుసుకున్నాడు. అతడు అమరావతి నుండీ వచ్చి ఇక్కడుంటున్నాడు. మేము మాట్లాడుకుంటూ కూర్చున్నాం. ఆయన నాకు తన కథంతా సంక్షిప్తంగా చెప్పాడు. అమరావతి వదిలిపెట్టి తాను గ్వాలియర్ రాష్ట్రానికి ఎలా వెళ్లిందీ, అక్కడొక గ్రామం ఎలా కొన్నదీ, అది ఆర్థికంగా ఎలా కలిసిరానిదీ, యింకా - తానొక మహాత్ముడిని కలుసుకోవటం, తనకు జబ్బు చేయటం, అన్ని రకాల ఔషధాలూ ఉపయోగించి చూడటం, రకరకాల సాధువుల, మహాత్ములను దర్శించటం, చివరికి సాయి మహరాజు తనను ఆయన చేతుల్లోకి తీసుకోవటం, తాను బాగు కావటం, ప్రస్తుతం ఆయన ఆజ్ఞ మీద సంస్కృతంలో ఒక స్తోత్రం రచించటం-అన్నీ చెప్పాడు. మేమంతా వేకువనే లేచి కాకడ హారతికి వెళ్ళాం. అది చాలా ప్రబోధాత్మకంగా ఉన్నది. నేను ప్రార్థన, స్నానం అయ్యాక సాయి మహరాజ్ బయటకు వెళుతుండగానూ, తిరిగి ఆయన వచ్చాకనూ, సాయంత్రం మరోసారీ దర్శనం చేసుకున్నాను. ఆయన నావైపు చూస్తూ "కా సర్కార్" అని అన్నారు. అప్పుడాయన నాకో సలహా యిచ్చారు. అది భగవంతుడు నన్నెలా ఉంచారో, అలాగే జీవించాలని. తన సంసారం పట్ల ప్రీతి ఉన్న మనిషి ఎన్నెన్నో భరించాలని అంటూ సాయంత్రం వరకు మలమలమాడి అప్పుడు ఓ ముతకరొట్టె చేసుకుతినే ఓ ధనవంతుడి కథ చెప్పారు. మేము మళ్ళీ సాయంత్రం సాయి మహరాజ్ దర్శనం చేసుకొని వచ్చి దీక్షిత్ వాడా వరండాలో కూర్చున్నాము.

బొంబాయి నుండి వచ్చిన ఇద్దరు పెద్దమనుషులు ఒక సితార్ తెచ్చి వాయిస్తూ భజన చెప్పారు. నేను హజరత్ అని పిలిచే తోసర్ కూడా చాలా చక్కని పాట పాడాడు. భీష్మ తన మామూలు భజన చేశారు. అర్ధరాత్రి వరకు చాలా సంతోషంగా గడిచింది. తోసర్ చాలా ఆనందాన్నిచ్చే సహ చరుడు. మా అబ్బాయి బల్వంతుతోను, మిగిలిన వాళ్లతోను నేను ఆత్మవిచారణ మొదలైన విషయాల గురించి చాలాసేపు మాట్లాడాను.

(సశేషం)

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

(గత సంచిక తరువాయి)

## స్థాయీ భేదాలు

సేవలో మూడు స్థాయీ భేదాలు కన్పిస్తాయి. మొదటిది - నా పనులు అయ్యాక మిగిలిన సమయంలో సేవ చేస్తాననటం. రెండవది - ఇది కూడా నా పనే ... నా పనులలో ఒకటిగా భావించి చేస్తాననటం, ఇక మూడవది - ఇదే నా పని ... ఏమైనా టైమ్ మిగిలితే మిగిలినవి చూస్తాననటం.

మొదటిది విద్యార్థి వంటిది. తన చదువు, ఆటలకు పోగా ఏమైనా సమయం మిగిలితే ఇంట్లో ఎవరికైనా సాయపడతాడతను. రెండవది గృహిణి వంటిది. ఎన్ని కొత్త పనులు వచ్చినా తన పనుల లిస్ట్‌లో అది కూడా కలిపేసుకొంటుంది గృహిణి. మొదట భర్త, అత్తమామలు, ఆడపడచులు, మరదులు. ఆ తరువాత తనకు పిల్లలు కలగగానే వాళ్లు,





భర్తగారి స్నేహితులు, మరదులు, ఆడపడచుల పెళ్లిళ్ల ద్వారా కుటుంబంలో చేరే క్రొత్త సభ్యులు. అతిథి అభ్యాగతులు, ఇరుగుపొరుగులు - యీ అందరికీ గృహిణి ఏదో ఒక సేవ చేస్తుంటుంది. ఆ లిస్ట్‌లో యిదీ ఒకటి అంటుంది మరోటి చేరితే - అంతేగానీ నెట్టెయ్యదు.

ఇక మూడవది నవజాత శిశువును పెంచే తల్లి స్థాయి. తన తిండి బిడ్డ ఆరోగ్యంతో, తన నిద్ర శిశువు నిద్రపోయే వేళలు కాకుండా, తన పనులు శిశువు నిద్రించే వేళలో, తన ఆటలన్నీ శిశువుతోనే, తన పాటలన్నీ శిశువుకు జోలలుగానే, ఆ శిశువు పెరిగే వరకూ తన జీవితంలోని ప్రతి క్షణాన్నీ వాడికే అంకితం చేస్తుంది తల్లి. ఇది సర్వశ్రేష్ఠ స్థితి. రెండవది మధ్యరకం దశ. మొదటిది సామాన్య దశ. మనం ఏ స్థాయిలో ఉంటామన్నది మన మానసిక, ధార్మిక వికాసాన్ని బట్టి ఏర్పడుతుంది.


కొంతమంది "ఏదో గొప్పగొప్ప వాళ్ళు చెయ్యగలరు గానీ - మనం సామాన్యులం.... మనమేం చెయ్యగలం?" అనుకుంటారు. అది శుద్ధ పొరపాటు. మన సంకల్పం గట్టిదైతే ఏదైనా చెయ్యగలం. ఎన్ని వందల మైళ్ల ప్రయాణమైనా మొదట ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. సంకల్పంలో శుద్ధి ఉంటే తప్పకుండా సిద్ధిస్తుంది.

ఇది నా అనుభవం. మొదటిరోజుల్లో ఓసారి గురుదేవులు ఏవేవో ప్రణాళికలు చెప్తుంటే - "అబ్బో, యివన్నీ మనమేం చెయ్యగలం!" అన్నాను తొందర పడి. అప్పటికింకా ఆశ్రమవాసం ప్రారంభం కాలేదు మాకు. మూడో రోజో, నాలుగో రోజో మాయింటికొక కార్డు వచ్చింది. అందులో రెండేలైన్లు-

**"మనమేం చెయ్యగలం కాదు**

**మనమే చెయ్యగలం"**

- ఇంతే ఉన్నది అందులో. నాకు అర్థమైంది. "మనమేం"లో ఆ 'సున్న' తీసేస్తే చాలు. సున్న అంటే శూన్యం - వాక్యూమ్ - ఖాళీ దాన్ని తీసేసి గుండెనిండా దీక్ష, భగవంతునిపై శ్రద్ధ నింపుకొంటే అన్నీ చెయ్యగలం. అలా మనం నింపుకొన్ననాడు సామాన్యులమే మాన్యులం కాగలం దైవదృష్టిలో కూడా. (సశేషం)




## స్వరాంజలి
# స్వీకరించు ప్రభూ

- శుకవాణి

ఈ ఉషోదయ ప్రభా సౌందర్యం
ఆ సాయం సమయ సుషమా రాగం
అరవిరిసిన విరిబాలల మధు సౌరభం
వనెవన్నెల చిరుపక్షుల కిలకిలారావం
జీవన పుష్పంలోని ప్రేమ పరాగం
షడ్రుచుల, నవరసాల సమ్మేళనం
సప్తవర్ణాలూ కలబోసిన శుభ్రవర్ణం
కళల ప్రాంగణాన విరిసిన మనో మయూరం
ఎదుటివారిలో నాకగుపించే సౌమనస్యం
వారు నా పట్ల చూపిన సౌదర్యం
అప్పుడప్పుడూ ఆవరించే అంధకారం
దాన్ని పారద్రోలగలిగే నా ధీరతా దీపం
నా చేతికి వచ్చిన ప్రతి సత్కార్యం
అది ఫలించేందుకు నాకున్న సౌకర్యం
కత్తి వాదరపై అడుగుపెట్టి పయనం
అలవోకగా దానిని దాటేసిన వయినం
బ్రతుకంతా నాకు తోడైన స్నేహ పరిమళం
కడపటి క్షణాల నిశ్చింతలో నేటి మధురస్వప్నం
స్వామీ, ఇవన్నీ నాకు అందించిన నీకిదే నా ప్రణామం!
ఆటుపోట్లకు అలసిసొలసిన మనసు ఆపమందిక గమనం
ఇక స్వీకరించు ప్రభూ ఇదే నా ప్రాణఉపాయనం.







## స్వరాంజలి
# శివార్చన

- సుమలత

కదలెనమ్మా శివుడు-తానాడెనమ్మా భవుడు
శివ శివ హర హర - శంభో శంకర
కదలెనమ్మా శివుడు - తానాడెనమ్మా భవుడు
తేజఃపుంజము నడచినటుల
ఘన హిమాద్రియే కదలినటుల ॥కదలె॥
ముమ్మొన శూలము చేతనబట్టి
శ్మశాన భస్మము నుదుటన బెట్టి
గజాజిన వసనము తనువున గట్టి
జటాజూటమున గంగను నిలిపి ॥కదలె॥
పునుకల పేరును మెడలో దాల్చి
అనలపుకీలను నుదుటన దాచి
శిరమున వెన్నెల రేకను నిలిపి
నాగాభరణపు మెరుపుల తోడ ॥కదలె॥
ప్రమథుల హరహర నింగిని నిండ
భంభం శంఖపు నాదముతోడ
ఢమరుక వాద్యపు రవళిని గలిపి
సురార్చిత పాదము నేలన బెట్టి ॥కదలె॥
కదలెనమ్మా శివుడు - తానాడెనమ్మా భవుడు
తేజఃపుంజము నడచినటుల
ఘన హిమాద్రియే కదలినటుల ॥కదలె॥

# మాతృసంస్థ కబుర్లు

మంగళవారం 5వ తేదీనాడు ఖాజీపేట గ్రామంలో 'శ్రీ సాయి గ్రామ కళ్యాణం' జరిగింది. ఆ చిన్న గ్రామమంతా చక్కగా శుభ్రం చేయటంలో సాయి విద్యాధామం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామీణులైన మరికొందరు పిల్లలు కూడా కలసి పనిచేసారు. ఇంటింటి గడపకూ ఓంకారం స్టిక్కర్లు అంటించారు. తరువాత సాయంత్రం వేళ సభ జరిగింది. పిన్నా పెద్దా రెండు వందల మంది హాజరయ్యారు. పూజానంతరం మాతాజీ యీ కార్యక్రమ పరిచయం చేసారు. గ్రామానికి 'బొడ్రాయి' అన్నదే లేదనీ, పూర్వం ఎప్పుడో యీ గ్రామం బాగా పెద్దదిగా ఉన్నపుడుండే బొడ్రాయి మామిడితోటలో ఎక్కడో ఉందనీ, గ్రామం చిక్కిపోయి యీ కాస్తే మిగిలిందనీ, ఆ బొడ్రాయి తోట వాళ్లివ్వటం లేదనీ వృద్ధ గ్రామీణులు చెప్పగా విని మాతాజీ - తల్లీకీ తన బొడ్డుకూ ఉన్న బంధం ఎంత సత్యమూ శాశ్వతమో గ్రామానికీ బొడ్రాతికీ ఉన్న సంబంధం అంత స్థిరమైనదనీ, దాని ఉనికినే విస్మరించటం కన్నతల్లిని మరచిపోవటమంత పాపమనీ అన్నారు. వివాహం చేసుకొని ఊరు విడిచి వెళ్లే ఆడపడచు బొడ్రాతికి పసుపు, కుంకుమ, పుష్పం పెట్టి నాకూ, నా జన్మభూమికీ బంధం తెగనీయ వద్దని నమస్కరించి మరీ పొలిమేర దాటాలనీ, అలాటి చక్కని అద్భుత సంప్రదాయం మరచిపోవటానికీ, కట్టు, బొట్టు, సంస్కృతి, సంప్రదాయం అన్నీ మంటగలుపుకోవటానికీ కారణం ఒక్కటేననీ, మనం హిందువుల మని మరచిపోవటమేననీ వివరించారు.

గొర్రెలలో పెరిగి స్వత్వం మరచిపోయిన సింహం గురించి చెప్పి, హిందువులు కేవలం సింహాలేకాదనీ, పోతన గారి భాగవంతలో భగవంతుడు 'కలడు త్రిలింగ దేశవ్యక్తులందతటన్' అని ప్రహ్లాదుని చేత





అనిపించారనీ, అలాటి పవిత్ర హైందవజాతి యిలా స్వాభిమానం, పురిటిగడ్డపై ప్రేమ మరచి జీవించటం మూర్ఖత్వమనీ, ఇకనైనా చైతన్యం పెంచుకొని భావితరానికి మన పెద్దల వారసత్వ సంస్కృతిని అందించమనీ ప్రబోధించారు. తరువాత గురుదేవులు ఖాజీపేట అన్నపేరు మార్చుకొమ్మని సూచించారు. తరతరాల మన ఘనత తిరిగి సంపాదించుకొనే ప్రయత్నం చెయ్యాలన్నారు. పరమ పవిత్రమైన యీ భరతభూమికి చెందిన ప్రజలను ఎవరో వచ్చి "మీరంతా పాపులు" అనే ధైర్యం ఎక్కడిది, మన పిరికితనమే వాళ్లకది యిచ్చిందన్నారు. అలక్ష్యంతో మనం వదిలేస్తే మన జాతి క్రమంగా యింకా పతనస్థాయికి వెళ్లిపోతుందనీ, పార్టీలకు, కులభేదాలకు అతీతంగా ధర్మరక్షణకు పూనుకోవాలనీ, అలాటి శక్తి పరమాత్ముడు యీ గ్రామానికి ప్రసాదించాలనీ ఆశీర్వదించారు. తదుపరి పల్లెపాటి యాదగిరి, జనార్దన్, రాములు గారల కుటుంబం తరఫున శ్రీమతి లలిత గురుదేవులను శాలువాతో పుష్పమాలలతో సత్కరించుకొన్నారు. ప్రసాదవితరణతో సభ ముగిసింది.

ఏప్రిల్ 12వ తేదీన 'సాయి గ్రామకళ్యాణం' కార్యక్రమం బొమ్మల రామవరం గ్రామంలో ప్రారంభమైంది. ఆ సాయంత్రం గ్రామమంతా శుభ్రం చేసే ప్రయత్నంలో విద్యాధామం పిల్లలు, కార్యకర్తలు కూడా చాలా శ్రమపడవలసి వచ్చింది. పిల్లలు ఎక్కువభాగం చిన్నవాళ్లు. చీపుళ్ల వగైరాలు అందించటంలో తప్ప గ్రామీణుల సహకారం వీళ్లకు అంతగా దొరకలేదు. గ్రామం పెద్దది. అయినాగానీ పట్టు వదలకుండా వీళ్లంతా శ్రమించారు. పూర్వ విద్యార్థినులు కొద్దిమంది ఒక టీమ్‌గా ఏర్పడి ఓంకారం స్టిక్కర్లు ప్రతిగడపకూ అంటించారు. మరునాడు ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం రామవరంలోని శ్రీ రామాలయ ప్రాంగణంలో సభ ఏర్పాటైంది. యథాప్రకారం సాయిధామం అభిమాని భాస్కర్ లైట్లు, పట్టాలు, బల్లలు వగైరాలు ఏర్పాటు చేసారు. శ్రీ సాయినీ, భరతమాతనూ, వివేకానందులను

అర్చించిన తరువాత మాతాజీ కార్యక్రమ పరిచయం చేసారు. "మా ఊరు, మా పని" అనే భావన ఉంటే యువజనులంతా యీ ప్రాంగణంలో ఉండాలి. కానీ, లేరు. అంటే - మనకు బడులు, కాలేజీలు, ఫ్రీ హాస్టళ్లు పెట్టడానికి, లోన్లు యివ్వడానికి, ఉద్యోగాలిచ్చి పోషించడానికి, కష్టాలలో ఆదుకోవటానికి మాత్రమే దేశం కావాలి. దీనిని కాపాడుకోవటానికి ఏం చెయ్యాలో మాత్రం మనం ఆలోచించం. దేశం కేవలం వృద్ధులదీ, పసి పిల్లలదేనా? విద్య అంటే, యవ్వనం అంటే-కేవలం వినోదం, విలాసం, ఎంజాయ్‌మెంట్ పేరిట తిని తాగటం-ఇంకా కాదంటే క్రికెట్‌లు, క్రీడలు, ప్రేమాయణాలు-యివి మాత్రమేనా? ఇవన్నీ జీవితంలో ఓ చిన్న భాగాలు మాత్రమే. నాలుగు పదులు కూడా బ్రతక్కుండానే నాలుగు జీవితాలకు సరిపడా పనిచేసిన వివేకానందుడు, అతి పిన్న వయసులోనే అనంత ప్రతిభ చూపిన వివేకానందుడు, అతి పిన్న వయసులోనే అనంత ప్రతిభ చూపిన శంకరాచార్యులు ఆనాడు యువకులే కదా! అందుచేత చైతన్య స్ఫూర్తిని మీలో నింపుకొని, గ్రామ యువత జాతి రక్షణకై, సంస్కృతీ పరిరక్షణకై కదలిరండి అంటూ దీపం, తులసి, బొట్టు మొదలైన వాని ప్రత్యేకతలను వివరించి, అమృతపుత్రులైన యీ నేల బిడ్డలిలా ఉండకూడదని ప్రబోధించారు. తదుపరి స్వామీజీ తమ ఆశీః ప్రవచనంలో ప్రాచీన భారతీయ ఔన్నత్యాన్ని పునరుద్ధరించుకోవడానికి ఏమి చెయ్యాలో వివరించారు. నేటి దశకు విచారాన్ని వ్యక్తం చేసారు. మార్గోపదేశం చేయటానికీ, క్రీడాదికాల ద్వారా, వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీల ద్వారా గ్రామచేతన కలిగించడానికి ఆశ్రమం సిద్ధంగా ఉందని దాన్ని ఉపయోగించుకోవలసిన బాధ్యత గ్రామీణులదేనీ వివరిస్తూ అందుకు తగిన శక్తి వారికి భగవంతుడు కలిగించాలనీ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఒకరెవరో వచ్చి మరొకరిని ఆహ్వానించవలసిన పని లేదన్నారు. అందరూ పూనుకోవాలని ఉద్బోధించారు. స్వాభిమానం





అలవరచుకోవలసిన ఆవశ్యకతను గూర్చి సోదాహరణంగా విశదీకరించారు. పశుస్థాయి నుంచీ మానవస్థాయికి చేరి, క్రమక్రమంగా దైవస్థాయికి ఎదగడమే హిందువు గొప్పదనమనీ, ఆ ప్రయత్నం వైపు అందరూ సాగిపోవాలనీ ఆశీర్వదించారు. తదుపరి చి॥ సాయికిరణ్, చి॥ ఝాన్సీ, చి॥మానసలు చక్కని భాషతో అందమైన భావాలతో యీ కార్యక్రమంలో తమ అనుభవాలను వివరించారు.

యువకుల తరఫున చి॥ విశ్వనాథ్ ముందుకు వచ్చి తమ గ్రామ సంక్షేమం కోసం ఒక ఆలోచనతో వచ్చిన వారికి తగిన సహకారం అందించి పెద్ద సభ ఏర్పాటు చేయలేకపోవటం తమకే బాధ కలిగిస్తోందనీ, మరోసారి యీ లోపాన్ని సరిచేసుకొంటామనీ చెప్పారు. అటుపైన శ్రీ పాపిరెడ్డిగారు ఇలాటి కార్యక్రమాలు అప్పడప్పడు జరుగుతూంటేనే చైతన్యం పెరుగుతుందంటూ గురుదేవులకు తమ ధన్యవాదాలు తెలుపుకొన్నారు. సాయిధామం తరఫున శ్రీ నారాయణగారు, శ్రీ కృష్ణప్రసాద్, శ్రీ కె. చంద్రారెడ్డిగారు, శ్రీ జి. చంద్రారెడ్డిగారు, శ్రీ పుట్టగుంట రామకోటేశ్వరరావు గారు, సాయి విద్యాధామం ఉపాధ్యాయులు జ్యోతి, నాగమణి, నరేశ్, శ్రీనివాస్‌లు, నందు యీ సభలో పాల్గొన్నారు.

ఏప్రిల్ 11వ తేదీన 'విజయ' ఉగాది సందర్భంగా సాయిధామంలోని మాతృమందిరంలో ఆశ్రమవాసుల సమావేశం జరిగింది. సాయిధామానికి తొలిదైవంగా వచ్చి యిక్కడ కొలువై రెండు దశాబ్దాలు దాటిన బాబావారి ఫొటో ముందు వేపపచ్చడి నివేదన పెట్టి, ప్రార్థన, పూజ నిర్వహించారు. మాతృమందిరం ఆవిర్భావాన్నీ, అక్కడ జరిగిన ఎన్నెన్నో మంచి విషయాలనూ, గతంలోని సత్సంగాలనూ స్మరించుకొన్నారు. తరువాత గురుదేవులు ఉగాది ఆశీస్సులను అనుగ్రహించారు.

ఏప్రిల్ 19వ తేదీ శ్రీరామనవమి. దేశమంతటిలాగే ఆశ్రమం కూడా ఆనందోత్సాహాలతో ఆ పండుగ జరుపుకొన్నది. ఉదయం పదిన్నరకు

సాలంకృత మంటపంలో పట్టుబట్టలు ధరించిన జానకీ రామచంద్రుల వివాహాలంకరణతో ఆసీనులయ్యారు. మామిడి తోరణాల పచ్చదనం పరిమళం, పూబాలల సోయగాలు, అందరిలో తొణికిసలాడే ఆనందం అన్నీ ముప్పిరిగొన్న సన్నిధానంలో పూజ ప్రారంభమైంది. స్నాతకం, ఎదురుకోళ్లు దేనికి? వధువు గౌరీపూజే ఎందుకు చెయ్యాలి - బాసికం ఎందుకు కడతారు - కన్యను దానం యివ్వడం ఏమిటి - అక్కడి మంత్రానికి అర్థం ఏమిటి? - తెర పట్టటం ఎందుకు? - జీలకర్ర బెల్లం వెనుక సైన్స్ ఏమిటి? - మాంగళ్యధారణ మంత్రార్థం ఏమిటి? - సప్తపది మంత్రాలకు అర్థం ఏమిటి? - యిలా ప్రతి మంత్రానికీ వెనుక ఉన్న అర్థాలు విడమరచి చెప్తూ కళ్యాణం చేయించాక - పట్టాభిషేకోత్సవం జరిపారు. దేశంలోని నదులు, చుట్టుప్రక్కల తీర్థాల నీటితో అభిషేకం చేసారు. తదుపరి చూర్ణిక చదువుతూ దేశాంతర్గత క్షేత్రాలు, తీర్థాలు, పుణ్య పురుషులు, యోగులు, చక్రవర్తులు, దేవతలు, గిరులు - అన్నింటినీ అందరినీ స్మరిస్తూ అందరూ అభిషేకం చేసాక, సింహాసనస్థులను చేసి, పలురకాల పుష్పాలతో, అక్షతలతో పూజించారు. ఈ దేశాన్ని సుస్థిరంగా పాలించి, ధర్మమార్గం తప్పని తీరున జాతిని నడిపించమని రామప్రభువును ఏకకంఠంతో ప్రార్థించారు. స్త్రీల వెంటబడి వేధించే కాకాసురులు, రావణాసురులు, ధర్మపరులను హింసించే ఖరదూషణులు, తాటకలు అణువణువునా నిండి ఉన్న యీనాడు నీ రక్షణ మాకు కావాలి స్వామీ!" అని వేడుకొన్నారు. శ్రీరామ జయరామ నామంతో, శ్రీ గడ్డం నరసింహారెడ్డిగారు తమ కంచు కంఠంతో చెప్పిన భజనలతో ద్వారవతి ప్రతిధ్వనించింది. (వడపప్పు, పానకాల పంపిణీతో నాటి ఉత్సవం ముగిసింది.)

తదుపరి గురుదేవులు శ్రీరాముని ధర్మనిష్ఠను గూర్చి వివరించారు. కుటుంబవ్యవస్థ ఆయన వలన ఎలా సుస్థిరమైంది - ఆయన మంచి





భర్తగా, మంచి అన్నగా, మంచి కొడుకుగా, చివరికి మంచి శత్రువుగా కూడా ఎలా జీవించాడో చక్కని సరళశైలిలో వివరించారు.

శ్రీ సాయినాథ క్షేత్రం (రేపల్లె)లోని సర్వతోభద్ర సాయిగుడిలో చి॥ భాస్కరప్రసాద్ శ్రీరామకళ్యాణోత్సవ నిర్వహణకు సారథ్యం వహించాడు. చి॥ సాయిరమణ సహకారంతో కళ్యాణం చక్కగా సాగింది. భాస్కర ప్రసాద్ స్వచ్ఛమైన ఉచ్చారణ, తీరు పూజకు వచ్చిన వారికి ఎంతో నచ్చి అభినందించారు. శ్రీ కోదండ రామసాయి సన్నిధానం (సత్తెనపల్లి)లో కూడా సీతారామ కళ్యాణం కన్నుల పండువుగా జరిగింది. పరిసరాలలోని భక్తులంతా పాల్గొని ధన్యులైనారని శ్రీ రామయ్యగారు, అక్కడి కార్యనిర్వాహకులు తెలియజేశారు.

మే నెల వచ్చింది. అసలు వసంతం రాకుండానే చైత్రంలోనే వైశాఖి (వేసవి) విరుచుకుపడింది. మండిపోయే ఎండలు, నిప్పులు చెరగటం-వంటి పలుకుబడులన్నిటినీ మించిపోయిన వేడి. హైదరాబాదుకు మును పెన్నడూ అనుభవానికి రాని ఉక్కపోత. అప్పుడప్పుడూ ఓ చిరుజల్లు పడి మరునాటి వేడి మరింత తీవ్రం కావటం. మధ్యాహ్నాలు నిశ్శబ్దం. ఎక్కడి వాళ్లక్కడ సొమ్మసిల్లినట్లు పడుకోవటమే తప్ప బయట మెసిలే పని లేదు. ఎప్పుడన్నా 'కావు కావు' అని అరిచే కాకిదో, నీళ్లకోసం వెదుక్కొంటూ కిచ కిచలాడే పిచ్చుకలదో శబ్దం తప్ప ఆశ్రమం అంతా నిశ్శబ్దం. అలాటి వాతావరణంలో ప్రయాణం చెయ్యాలి-తప్పదు. 'తప్పనిసరిగా వెళ్లాలి, లేకపోతే మన ఆశ్రమం కార్యక్రమం ఎలా నడుస్తుంది!, అని మేము వాస్తున్న కాళ్లూ, పట్టుకుపోతున్న కీళ్లూ సరిచేసుకొని, రైలెక్కి, దిగీ సాయినాథ క్షేత్రం (మైనేనివారిపాలెం) చేరుకొనేటప్పటికి పదవ తేదీ తెల్లవారింది. అప్పటికి రెండు రోజుల క్రితమే అక్కడికి చేరిపోయి తిష్ఠ వేసి కోటేశ్వర్రావు మామయ్య బుర్ర సగం తినేసిన మా పిల్లపటాలం తాము చేసిన వీర కార్యాలన్నీ ఏకరువు పెడుతోంటే వింటూ- స్నానాదికాలు, అల్పాహారాలు

చేసి కాస్త విశ్రాంతి తీసుకొన్నాము. అటుపైన పిల్లలంతా చేరి శ్రీకాకుళం వెళ్లి వస్తామన్నారు. "చూచిందే గదరా!" అంటే "సార్లు చూడలేదుగా!" అంటూ శ్రీనివాస్‌నూ, నరేశ్‌నూ అడ్డం పెట్టుకొని అందరూ వేన్ ఎక్కేసారు. వీళ్లకు తోడు మా జన్మవృద్ధుడూ-నిత్య యవ్వనుడూ కూడా అయిన కోటేశ్వర్రావు కూడా పారిపోయాడు. దాంతో ప్రశాంతంగా వచ్చిపోయే భక్తులతో మాట్లాడుతూ కూర్చున్నాము.

11వ తేదీ ఉదయం శ్రీ సాయికి అభిషేకం చేసాక-సాయి చాలీసా, విష్ణు సహస్ర నామాల పారాయణ చేసారు భక్తులంతా. అటుపైన సాయికి పుష్పాలతో సహస్ర నామార్చన జరిగింది. ఆ రోజు శనివారం గనుక పిల్లలందరూ హనుమాన్ చాలీసా సుస్వరంగా చదివారు. తదుపరి మహాహారతి-అటుపై భోజనాల కార్యక్రమం నడిచాయి. తెనాలి, రేపల్లె, చల్లపల్లి, ఖమ్మం, గుంటూరు, హైదరాబాదుల నుండి వచ్చిన భక్తులతో కబుర్లతో, మా రాక్షసులు కోసి రుబ్బి కాళ్లకూ, చేతులకు గోరింటాకు పెట్టుకోవడంతో సందడిగా గడిచింది. పొట్టలనిండా శేషు కొట్టిచ్చిన తాటిముంజెలు, భాస్కరన్నయ్య తెచ్చిచ్చిన చక్రకేళీలు మేసేసిన బాలరాక్షసులంతా ఆదమరిచి నిద్రపోయారుగానీ-మా పని మాత్రం పెనం మీది నుంచీ పొయ్యిలో పడినట్లయింది. సాయిధామంలో ఎంత వేడిగా ఉన్నా చెమట చిత్తడి ఉండదు. క్షేత్రంలో అలా కాదు. రోజుకు రెండుసార్లు సాధారణ స్నానమైతే కనీసం పదిసార్లైనా సచేల స్నానం తప్పదు-కాకపోతే నీళ్లకు బదులు చెమటతో.

ఆ రాత్రి (11) ఆరుబయట మంచి సత్సంగ సమావేశం జరిగింది. ముందుగా ఆశ్రమబాలబాలికలు భజనలు వినిపించారు. అటుపై భగవద్గీతలో నుంచీ కర్మయోగం, భక్తియోగం, దైవాసుర సంపద్విభాగ యోగం-మూడూ శ్రావ్యంగా చెప్పారు. ఆ తరువాత గురుదేవులు సాధన గురించీ, యమ నియమాలను గూర్చీ, అహింసను గురించీ, హింసాహింసల నడుమ గల భేదాన్ని గూర్చీ వివరించారు. వ్యక్తిగతంగా కలిగిన అవమానాన్ని, దుఃఖాన్నీ సహించాలనీ-సమాజగతంగా, ధర్మపరంగా కలిగే





నష్టాన్నీ, అవమానాన్నీ ఖచ్చితంగా ఎదిరించాలనీ, పెద్ద హింసను అరికట్టడానికి చిన్నహింసకు అడ్డుపెట్టటం చాలా యోగ్యమైన ధర్మమనీ వివరించారు. ఈ భావాలపై చిన్న చర్చ నడిచింది. చివరగా అహింస పరమధర్మమని ప్రబోధించిన గౌతమబుద్ధుడే క్రూరశత్రువులు రాజ్యం మీదికి దండెత్తి వస్తున్నారని విన్నపుడు-వారు ప్రజలను పెట్టబోయే హింసను ఆపడానికి కొంత యుద్ధం తప్పదని చెప్పిన ఐతిహ్యాం గుర్తు చేసుకున్నారు మాతాజీ. అంతేకాదు-ఒక స్త్రీ మానభంగానికి గురికాబోతూ శరణు కోరగా ఆ నీచకార్యాన్ని చూడలేనని కళ్లూ, చెవులూ మూసుకొని కుటీరంలో కూర్చొని జపం చేసుకున్న సాధువు, ఆ స్త్రీని రక్షించటం కోసం దుండగులను తన్ని ఒకడిని చంపిన త్రాగుబోతు-యీ యిద్దరిలో ఎవరు పుణ్యాత్ముడో ఆలోచించాలని ప్రబోధించారు. రాత్రి తొమ్మిదిన్నరకు సత్సంగం ముగిసింది.

12వ తేదీ ఉదయం నుంచే కోలాహలం ప్రారంభమైంది. ఆరయ్యేటప్పటికి భక్తులు రావటం ప్రారంభమైంది. లేలేత మామిడాకుల తోరణాలతో, అరటి మొలకలతో అలంకృతమైన మంటపంలో శ్రీ సాయీశ్వరులు "నన్ను తడుపుతారా, అభిషేకిస్తారా? నేను ఎంత ఉన్నాననుకొంటున్నారు? ఈ సువిశాల విశ్వంలో అణువణువునా నేనే ఉండగా ఎక్కడని తడపగలరు? ఈ బొమ్మ వరకే నంటారా! అయితే సరే, అన్నట్లుగా చిరునవ్వుతో చూస్తున్నారు. భక్తులు కృష్ణానది నుండీ బిందెలతో నీళ్లు తెచ్చారు, ఫల రసాలు, క్షీరం సిద్ధమైనాయి. సాయినామం "ఓం సాయిరామ్, శ్రీ సాయి రామ్, జయజయ సాయిరామ్ జయసాయిరామ్" అఖండంగా నడుస్తుండగా అభిషేకం ప్రారంభమైంది. రకరకాల ఫలరసాలతో తొలుత, క్షీరాభిషేకం తరువాత, అటుపై కృష్ణానదీ జలంతో, వెన్నతో, చివరిగా శుభ్రజలంతో సాయినాథులవారు జలాకాలాడారు. అటుపైన స్వామివారికి తడులొత్తటం, వస్త్రధారణం, పుష్పమాలలతో, కిరీటంతో అలంకారం వగైరాలు సాగాయి. భక్తులు ఆలయం నిండిపోయారు. సామూహిక సహస్ర

నామార్చన ప్రారంభం అయింది.

మారేడు దళాలు, తులసి దళాలు, మల్లె, మందార, కనకాంబరం, గులాబి, వెన్నముద్దలు, నూరు వరహాల వంటి రకరకాల పుష్పసంపద పోగుబడింది. క్షేత్రం దగ్గర పెద్ద పెద్ద దొంతర మల్లెపూలు ప్రత్యేకంగా పూస్తాయి. బంతిపూలతో, వన్నెవన్నెల మందారాలతో మంటపాలంకరణ చేసారు. భక్తులు ఒక్కొక్క పుష్పంతో పూజిస్తుండగా, అక్షతలు చల్లుతుండగా -వేదికపైన పూజారులు దోసిళ్లతో పూలు సమర్పిస్తూ సహస్ర నామాలతో అర్చన చేసారు. పూజానంతరం మహాహారతికి ముందర గురుదేవులు ఆశీఃప్రవచనం చేసారు. బాబా శక్తినీ, ఆయన కరుణాళుత్వాన్నీ వివరిస్తూ ఎన్నెన్నో విషయాలు స్పృశించారు. నిత్యం దర్శనం, వారానికోసారి సత్సంగం చేసుకొంటూ ధన్యులు కావలసిందిగా పిలుపు నిచ్చారు.

అటుపైన ఆశ్రమం పట్ల కూర్మి గల భక్తురాలు శ్రీమతి సుంకర శారదమ్మగారు "గురువుగారు ఇక్కడ లేనప్పుడు కూడా వారి స్పృహ మాకుండాలి. అందుకోసం యిది" అంటూ గురుదేవుల చిత్రపటం ఒకటి ఆలయానికి సమర్పించి, నూతన వస్త్రాలతో గురుదేవులను సత్కరించు కొన్నారు. అంతలో మహాహారతి వేళ అయింది. మామూలుగా అయితే భీకరమైన ఉక్కపోతకు, అంతకన్నా భీకరమైన కరెంటు కోతకు గురి అయి, ఆలయంలోని భక్తులంతా ఎంచక్కా కుమ్ములో పెట్టిన చిలకడ దుంపల్లాగా ఉడికిపోవాలి. కానీ, జనరేటర్ తీసుకువెళ్లటంతో యీ ప్రమాదం కొంతైనా తప్పిందనిపించింది. హారతి తరువాత గురుదేవుల దగ్గర ఆశీస్సులు తీసుకుని భక్తులంతా భోజనాలకు తరలివెళ్లటంతో నాటి ఉత్సవం ముగిసింది.

ఈ ఉత్సవాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఒళ్లు దాచుకోకుండా దైవ సేవ చేసుకొన్న చి॥ సాయిరమణ, చి॥ కన్నయ్య, ఏలియా, భిక్షాలు, సుబ్బారావు, కుమారస్వామి తదితరులకు శ్రీ సాయి విశేషాశీస్సులు.





## విషాదం

కాకినాడ రూరల్ కొవ్వాడ గ్రామంలోను, పరిసరాలలోను దశాబ్దాల తరబడి శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ సప్తాహాలు నడిపి, ఎందరెందరినో సాయిపథంలోకి తెచ్చిన భక్తుడు, కర్మయోగి, మంచి కార్యదక్షులు - అన్నిటినీ మించి బాబా భక్తులను, బోధకులను అందరినీ ఒకే వేదికమీదికి తేవాలన్న తీవ్ర తపన గల తపస్వి శ్రీ తిరుమలశెట్టి సుబ్బారావుగారు. ఉద్యోగ విరమణ తరువాత మరింత వేగంగా పనిచేస్తున్న సుబ్బారావుగారు నాలుగు వందల సప్తాహాలు పూర్తి చేయనున్న తరుణంలో వారిని హఠాత్తుగా కాలం కబళించటం భక్త లోకానికి ఎంతో వ్యధ కలిగించింది. మే 7వ తేదీన హైదరాబాద్‌లో తమ చివరి సప్తాహం పూర్తి చేసి 8న కొవ్వాడ చేరుకొన్న సుబ్బారావుగారు 9వ తేదీ మధ్యాహ్నం శ్రీ సాయిలో ఐక్యం చెందారు. వారి ఆత్మ శాశ్వతంగా అక్కడే ఉండాలని ప్రార్థిద్దాం.

సుబ్బారావుగారి కుటుంబానికి, సన్నిహితులకు సాయివాణి ద్వారా శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు, సాయిధామం ఆశ్రమం తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

## శ్రీ రమణ ఉవాచ

శ్రీ రమణ మహర్షుల వారు చిన్నచిన్న మాటలతో, చేష్టలతో అద్భుత మైన ఉపదేశాలిచ్చేవారు. ఒకసారి ఒక పండితుడు "భగవాన్! నిష్కామకర్మ అంటే ఏమిటి?" అని అడిగాడు. భగవాన్ వెంటనే జవాబివ్వలేదు. మౌనం వహించి, కొంతసేపైన తర్వాత కొండ మీదకు వెళ్తున్నారు. ఆ పండితుడు, మరికొందరు భక్తులు భగవానుని అనుసరించారు. కొండమీద దారిలో ముళ్లతో నిండిన ఒక చెట్టు కొమ్మ పడి ఉండగా, భగవాన్ దానిని తీసి అక్కడే కూర్చొని, ఆ ముళ్లన్నీ చెక్కి ఆ కొమ్మను ఒక కర్రగా, నునుపుగా ఎంతో సుందరంగా తయారుచేశారు.

అంతలో ఒక గొడ్ల కాపరి కుర్రవాడు, చేతిలో కర్ర లేకుండా భగవాన్‌కు ఎదురయ్యాడు. అతని కర్ర ఎక్కడో పోవటం వల్ల చాలా విషాదంగా ఉన్నాడు. ఆ కుర్రవానిని చూచి భగవాన్ తాను అంత శ్రమపడి తయారుచేసిన కర్రను అతనికి ఇచ్చివేశారు. ఆ కుర్రవాడు ఆ కర్ర పట్టుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు.

అదంతా చూస్తున్న పండితుడు ఆనందంతో "భగవాన్, నిష్కామకర్మ అంటే ఏమిటో ఆచరణపూర్వకంగా తెలియజెప్పారు'' అంటూ నమస్కరించాడు.

## సాయితో నా అనుభవం

నా పేరు వాగిచెర్ల వెంకటేశ్వర్లు. మాది ప్రకాశం జిల్లాలోని ఉలవపాడు. నా ధర్మపత్ని చాలా సంవత్సరాల నుండి శివుడు, సాయిబాబా ఒక్కరే అని చెప్పేది, అయినా నాకు నమ్మకం కలగలేదు. అనేక శివాలయాలకు వెళ్లి పూజలు చేస్తుండేవాణ్ని. అనేక బాబా దేవాలయాలకి వెళ్లి ప్రదక్షిణలు చేసేవాణ్ని కూడా.

మా ఊరికి దక్షిణంగా రాజుపాలెం అనే ఒక ఊరు ఉంది. ఒకరోజు అక్కడికి వెళ్లాను. అక్కడి సాయిమందిరంలో ఎన్నోసార్లు ప్రదక్షిణలు చేసాను. ఆ రోజు కూడ అలాగే చేస్తున్నాను. మూడవ ప్రదక్షిణంలో గుడి వెఉక ఈశాన్యమూలకు తిరిగగానే నా మనోనేత్రానికి స్పష్టంగా కనిపించింది శివుడు స్మశానంలో ఉండటం, బాబా ముందు ధుని వెలుగుతుండటం రెండూ ఒక్కసారే అలా కనిపించడం ఇద్దరూ ఒక్కరే అని చెప్పటంగానే నేను భావించాను. అదీగాక ఇద్దరయ్యలకు ప్రసాదం విభూతే కదా!

ఆ రోజు నుంచి నా పేరు "శివసాయి" అయిపోయింది. నా ఇష్ట మంత్రం "ఓం సాయి శ్రీ సాయి శివ శివ సాయి" అయింది. నేను పూర్తిగా సాయిభక్తుడిగా మారిపోయాను. నాకు తెలిసినవారందరికీ సాయి శివ నామం చేయమని చెప్తుంటాను. కష్టాల్లో ఉన్న వారికి విభూతి అందిస్తాను. అలా నా జీవితమే సాయిమయం అయిపోయింది.





## సమయపాలన-1

- శ్రీ ఎం.వి. మాధవరావు

కాలం చాలా అమూల్యమైనది. కాలం గడిచింది అనే మాట దోష పూరితం. కాలం గడిచిపోవటం అంటూ ఉండదు. అది చక్రం. ఆ చక్రం మీద కాస్సేపు తిరిగి మనమే జారి పడిపోతూ ఉంటాం. జరిగేది మన ఆయువే. కాలప్రవాహం ఎవ్వరి కోసమూ ఆగదు. మనం ఎన్ని ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు తీయవలసి ఉందో అవి పూర్తికా గానే ఇంకొక్కక్షణం కూడా నడవనివ్వదు మనను తనతో. ఈ రహస్యం తెలిసిన యోగులు, సాధు సత్పురుషులు ఎవ్వరైనా తమ జీవితాలను వృథాగా గడుపుకోరు. వారే కాదు - సాధకులైన వారందరూ కూడా ఎప్పటికప్పుడు తాము ప్రతిక్షణం మృత్యువుకు దగ్గరవుతున్నామనీ, అందుచేత ప్రతి క్షణమూ విలువైనదేననీ భావించాలి. అందుకు అనుగుణంగానే ప్రవర్తించాయి. సమయపాలనం అన్నది సాధకుల, యోగుల క్రమశిక్షణ నియమాలలో ఒకటిగా భావిస్తారు- భావించాలి. నా అనుభవంలో రెండు, మూడు విషయాలు ఇలాంటివి జరిగాయి. అవి మీతో పంచుకొంటాను.

నేను బెంగుళూరులో ఉంటున్నానప్పుడు. చండీగఢ్‌లో ఉండే స్వామీ శాస్త్రానందవారు తామె బెంగుళూరు వచ్చామనీ, ఫలానాచోట ఉన్నామనీ, తమనొకసారి వచ్చి కలుసుకోమనీ ఫోన్ చేయించారు. ఎప్పుడు రమ్మంటారని అడిగితే పదిన్నరకు రమ్మన్నారు. సరే-నేను గబగబ నా పనులన్నీ ముగించుకొని, కారు తీసుకొని బయలుదేరాను. స్వామీజీ రమ్మన్న దానికన్నా చాలా ముందుగానే రాగలిగానని సంతోషంగా వారి గేటు దాకా వెళ్లిన నాకు సర్రున కోపం వచ్చింది. "నన్ను రమ్మని పనిమాలా ఫోన్ చేయించి, ఫలానా టైమని చెప్ప మరీ వెళ్లిపోతారా-ఎంత స్వామీజీ అయితే మాత్రం! ఆయన వచ్చేదాకా ఉండి అడిగి మరీ వెళ్లాలి- అని

అతిథుల (విజిటింగ్) హాల్‌లోకి వెళ్లి సోఫాలో కూర్చున్నాను. ఏవేవో ఉక్రోషపు ఆలోచనలతోనే కొంతసేపు గడిచింది. ఓ చిన్న కుర్రవాడు హాల్లోకి వచ్చి "మీరేనా మాధవరావుగారంటే?" అని అడిగాడు. ఔననగానే "మిమ్మల్ని స్వామి లోపలికి రమ్మంటున్నారు" అన్నాడు. టైమ్ చూచాను. సరిగా పదిన్నరయింది. లోపలికి వెళ్లి స్వామీజీకి నమస్కారం చేసి కూర్చోగానే "నీవు రావటం చూచాను మాధవా! కానీ, నేను పదింబావుకు వస్తానని ఒకరికి మాటిచ్చాను. దగ్గరే. అక్కడికి వెళ్లి, వాళ్లను కలిసి, నీకిచ్చిన వేళకు రావాలి గదా అని త్వరగా వచ్చేసాను" అన్నారు. మనఃపూర్వకంగా మరోసారి వారికి పాదాభివందనం చేసాను. ఇదీ - అచ్చమైన యోగి పరిస్థితి" అనుకొన్నాను.

మరోసారి యిలాటి అనుభవం శ్రీశ్రీశ్రీ స్వామీ విద్యా మాన్య తీర్థ మహరాజు వారితో కలిగింది నాకు. వారు నాకు వానప్రస్థాశ్రమ దీక్ష యిచ్చిన గురువులు. వారితో ఆశ్రమంలో ఉంటున్నాను అప్పట్లో. నా గది స్వామి వారి గదికి ఎదురుగానే ఉండేది. మధ్యలో నడిచేందుకు నడవా ఉండేది. ఒక ద్వాదశినాటి రాత్రి ఆరుగంటలకే భోజనం చేసేశాము అందరం. స్వామీజీతో ఏదో మాట్లాడుతూ, నడుస్తూ నడుస్తూ అలాగే వారి గదిలోకి వెళ్లిపోయాను. స్వామివారు చాలా మర్యాదగా, మెత్తగా "మాధవా, నేను పదిన్నరకు బయలుదేరి వెళ్లాలి. ఆ లోపల కాస్త విశ్రాంతి తీసుకుంటే బావుంటుందనుకొంటున్నాను" అన్నారు. నేను వెంటనే చేతులు జోడించి, "మరి నేను సెలవు తీసుకుంటాను" అన్నాను. ఇక నా గదిలో కూర్చుని ఏదో వ్రాసుకుంటూ ఉండిపోయాను. చాలాసేపటి తరువాత టక్‌టక్‌మని పాంకోళ్ల (చెక్క పాదుకల) చప్పుడు వినిపించింది బయట. టైమ్ చూచాను. పదీ ఇరవై తొమ్మిది. వెంటనే లేచి వెళ్లి స్వామి వారికి నమస్కారం చేసి "ఇంత సరిగ్గా సమయానికి బయలుదేరారే-మెలకువ





వచ్చిందా?" అని అడిగాను. "మనసెప్పుడూ మెలకువతోనే ఉండాలి మాధవా!" అంటూనే ముందుకు నడిచారు. తీరా చేసి డ్రైవరు రాలేదు. సరే, స్వామి వారిని తీసుకువెళ్లడానికి నేనే సిద్ధమయ్యాను. గేటు దాటామో లేదో డ్రైవరు ఉరకలు పరుగుల మీద ఎదురయ్యాడు. వాడి వాచి ఐదు నిముషాలు ఆలస్యంగా నడుస్తోందేమో! మొత్తం మీద స్వామీజీ సమయపాలన ప్రభావం పనివారి మీద కూడా పడక తప్పదు గదా!

ముందు ఎయిర్‌ఫోర్స్ వైమానికదళంలో పనిచేసిన అనుభవం వలన కొంతా, శాస్త్రానంద స్వాములు, విద్యామాన్యతీర్థ మహరాజుల వంటి పూజ్యులు ఒద్దికలో మెలగటం వలన కొంతా నాకు కాలం విలువ బాగా తెలిసింది. వేళమించిపోతున్నదనీ, మృత్యువు పొంచి ఉన్నదనీ తెలిసి కూడా విషయలాలసతోనో, ఉబుసుపోక కబుర్లతోనో, ఏవో దిగుళ్లు ఊహించు కొంటూనో, ఉన్న కాస్త జీవితాలూ వ్యర్థం చేసుకొంటున్న వారిని చూస్తే తిక్క కోపం వస్తుంటుంది. ద్వేషంతో, క్రోధంతో కాదు సుమా - ప్రేమతో, కరుణతో.

## శ్రీ సాయి విద్యాధామం

శ్రీ సాయి విద్యా ధామం (సాయిధామం వారి) ఉచిత ఉన్నత పాఠశాల (ఇంగ్లీషు/తెలుగు) (ప్రభుత్వ రికగ్నిషన్ పొందినది.) ఈనెల 17వ తేదీ విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. బొమ్మలరామారం మండల స్థాయిలో ఈ పాఠశాల విద్యార్థినీ చి॥ పకీరు సాయిపూజకు ప్రథమస్థానం, చి॥ ఎన్.రాజేశ్వరీదేవికి ద్వితీయ స్థానం లభించింది. పాసైన విద్యార్థులందరికీ శ్రీ సాయి ఆశీస్సులు లభించుగాక - అని గురుదేవుల ప్రేమాశీస్సులు.